## నేడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్



చేర్యాల నుంచి బస్సులో సామగ్రితో వెళ్తున్న సిబ్బంది



పోలింగ్ సామగ్రితో మద్దూరుకు చేరుకున్న సిబ్బంది



మిరుదొడ్డిలో పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీస్తున్న తహసీల్దార్ ఉదయశ్రీ

## పొలం వద్ద గులాబీ జెండా ఎగురవేసి నిరసన

చేర్యాల, ఫిబ్రవరి 26 : మండలంలోని చుంచనకోట గ్రామానికి చెందిన పండుగ రమేశ్‌ముదిరాజ్ అనే యువకుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో తన వ్యవసాయ పొలం వద్ద గులాబీ జెండాను ఎగురవేశాడు. కేసీఆర్ పాలనలో పదేండ్లు పొలం ఎండలేదని, రేవంత్ పాలనలో పంటలు ఎండుతున్నందుకు నిరసనగా వ్యవసాయ పొలం వద్ద బీఆర్ఎస్ అధినేత కేసీఆర్,ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఉన్న జెండాను ఎగురవేసి తన అభిమానం చాటుకున్నాడు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రతినిధులు తడ్కపల్లి ప్రవీణ్, నర్సింహులు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయడంతో అది కాస్తా ట్రెండింగ్ అయ్యింది.




చుంచనకోటలో కేసీఆర్,పల్లా ఉన్న జెండాను ఎగురవేస్తున్న రమేశ్

## బండ ప్రకాశ్‌కు శుభాకాంక్షల వెల్లువ

కొమురవెల్లి, ఫిబ్రవరి 26 : శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్‌ను బుధవారం బీఆర్ఎస్ కొమురవెల్లి మండల మహిళా ఉపాధ్యక్షురాలు బచ్చల బాలమణీశ్రీశైలం ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండ ప్రకాశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.



బండ ప్రకాశ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బాలమణీ శ్రీశైలంముదిరాజ్

## మహాశివరాత్రి సందర్భంగా పండ్లు పంపిణీ



యోగలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నేత ఇర్షద్ హుస్సేన్

సిద్దిపేట కమాన్, ఫిబ్రవరి 26 : మహాశివరాత్రి సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని 23వ వార్డులో యోగలింగేశ్వరదేవస్థానానికి వచ్చే భక్తులకు బీఆర్ఎస్ నాయకుడు ఇర్షద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆవు పాలు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 ఏండ్ల నుంచి ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 23వార్డు యువకులు ప్రణీత్ , వెంకటరమణ, వార్డు అధ్యక్షుడు యాదగిరి, సల్మాన్, అథర్, మంతూరి శేఖర్, మధు, విజయ్ పాల్గొన్నారు.

## క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలి

తొగుట,ఫిబ్రవరి 26: గ్రామీణ యువకుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలని తొగుట సీఐ లతీఫ్,ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ వేల్పుల స్వామి అన్నారు. బుధవారం మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఎల్లారెడ్డిపేటలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. మొదటి బహుమతికి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేల చొప్పున నగదుతో పాటు షీల్డ్ అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామస్తులు, యువకులు క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సీఐ లతీఫ్, మాజీ ఎంపీటీసీ స్వామి

## పరిశోధనపత్రం సమర్పించిన యువ శాస్త్రవేత్త



ప్రశంసాపత్రం అందుకుంటున్న యువశాస్త్రవేత్త డాక్టర్ మదన్‌మోహన్

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 26 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సూక్ష్మశాస్త్ర విభాగాధిపతి, యువ శాస్త్రవేత్త డాక్టర్ మదన్‌మోహన్ నేపాల్‌లో జరుగుతున్న మూడో అంతర్జాతీయ బయోటెక్నాలజీ సదస్సులో జంపన్న వాగు నీటి నాణ్యతపై ప్రయోగాత్మకంగా చేపట్టిన పరిశోధన పత్రాన్ని సమరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేపాల్ కాట్మండ్ బయోటెక్నాలజీ సొసైటీ ఆఫ్ నెపాల్ ఆధ్వర్యంలో రెండు రోజుల సదస్సు జరిగిందన్నారు.వివిధ దేశాల నుంచి పరిశోధకులు తమతమ పరిశోధన పత్రాలను సమర్పించినట్లు తెలిపారు. సదస్సు నిర్వాహకులు మదన్‌మోహన్‌కు ప్రశంసాపత్రాన్ని అందిజేశారు. యువ శాస్త్రవేత్త మదన్‌మోహన్ నేపాల్ పర్యటనకు అనుమతి ఇచ్చిన కమిషనరేట్ కాలేజ్ ఎడ్యుకేషన్ వారికి కళాశాల ప్రిన్సిపాల్ సునీత కృతజ్ఞతలు తెలిపారు.

# పరమశివుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి



సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌లో పూజలు చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



నంగునూరు : ఖాతా మహదేవస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



నారాయణరావుపేట: మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సలంద్రి శివాలయంలో పూజలు చేస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

### మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట కమాన్, ఫిబ్రవరి 26 : సిద్దిపేట పట్టణంలోని ఉమాపార్థివ కోటిలింగాల దేవాలయంలో స్వామి వారిని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు దర్శించుకొని పట్టువస్త్రాలు సమర్పించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమశివుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. స్వామి వారి దయ, కేసీఆర్ నాయకత్వంలో ఈ ప్రాంతంలో కాళేశ్వరం జలాలు పరవళ్లు తొక్కుతున్నాయన్నారు. సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ శివాలయంలో జరిగిన కల్యాణోత్సవంలో ఆయన పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ అర్చకులు, హరీశ్‌రావును ఆశీర్వదించగా నిర్వాహకులు సన్మానించారు. అనంతరం మహా శివరాత్రి సందర్భంగా గ్రామంలో వెలిసిన శివాలయంలో స్వామిని దర్శించుకున్నారు.

**ఆలయాల్లో పూజలు**

నంగునూరు, ఫిబ్రవరి 26 : నంగునూర్ మండలంలోని ఖాతాలో వెలిసిన మహాదేవ స్వామిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దర్శించుకొని పూజలు చేశారు. గుట్ట పైకి నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డు మార్గాన్ని ప్రారంభించారు. బద్దిపడగలో వెలిసిన శివాలయంలో స్వామివారి దర్శించుకున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంట నంగునూరు మండల నాయకులు ఉన్నారు.

**సలంద్రి శివాలయంలో**

చిన్నకోడూర్, ఫిబ్రవరి 26: మండలంలోని మెట్‌పల్లి మధిర గ్రామం సలంద్రిలోని శివాలయాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధికి రూ. 50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, నాయకులు పాల్గొన్నారు.

**బుగ్గరాజేశ్వరస్వామి ఆలయంలో..**

నారాయణరావుపేట, ఫిబ్రవరి 26 : మండలంలోని బుగ్గరాజేశ్వర స్వామిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రికి ఒక ప్రత్యేకత ఉందన్నారు. అందరూ స్వామికి అభిషేకం చేసే గొప్ప పండుగ శివరాత్రి అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ మున్సిపల్ రాజనర్సు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మాజీ ఎంపీపీ బాలకృష్ణ, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ప్రజ్ఞాపూర్ పార్థియేశ్వరాలయంలో అభిషేకంలో పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



చేర్యాల పట్టణంలోని శివాలయంలో అభిషేకం చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి దంపతులు

# హర హర మహాదేవ..

- జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు

జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రిని వైభవంగా జరుపుకొన్నారు. బుధవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హరహర మహాదేవ అంటూ భక్తులు చేసిన శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. శివాలయాల్లో భక్తులు అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, ఫిబ్రవరి 26



హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లిలో రాజేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్దిపేట కోటిలింగాల దేవాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



మద్దూరు రామాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి




సీఎం రేవంత్‌రెడ్డికి రాసినపోస్టు కార్డులను చూపుతున్న ఫోరం నాయకులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 26: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకుడు గడిపె మల్లేశ్ డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్‌లో ఉద్యమకారులతో కలిసి పోస్టుకార్డుల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉద్యమకారులకు 250గజాల స్థలంతో పాటు నెలకు రూ.25వేల పింఛన్ ఇస్తామని, ఆర్టీసీ బస్సు, రైళ్లలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని, రూ.10వేల కోట్లతో ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్‌లోఐదుఎకరాల స్థలంలో ఉద్యమకారుల సంక్షేమ భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగాపై హామీలన్నీ సత్వరంగా అమలు చేసి తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డు ఉద్యమం ద్వారా తెలియజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ కన్వీనర్ మాదాసు శ్రీనివాస్, నాయకులు సంజీవరెడ్డి, అంకుషావలి, సదానందం, జగదీశ్వరాచారి పాల్గొన్నారు.

# పశువుల దవాఖాన పనులు పూర్తయ్యేనా?

- ఇబ్బందులు పడుతున్న రైతులు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 26: పశువుల దవాఖాన అందుబాటులో లేక సేవలు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిరుదొడ్డి టౌన్‌లో నూతనంగా నిర్మిస్తున్న పశువుల దవాఖాన పనులు పూర్తి కాలేదు. దీంతో టౌన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద చిన్న భవనంలో పశువుల దవాఖాన కొనసాగుతున్నది. టౌన్‌కు దూరంగా దవాఖాన ఉండడం చేత వ్యాధులు సంభవించిన పశువులు నడవలేని స్థితిలో ఉండడం కారణంగా వాటిని దవాఖాన వద్దకు కొట్టుకుపోయి డాక్టర్‌కు చూపించి మందులు తీసుకొని తిరిగి దొడ్డికాడికి కొట్టుకురావడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధుల బారిన పడిన లేగలు, దుడ్డెలు, మేకలు, కుక్కలను రైతులు సైకిళ్లకు తట్టలో కట్టుకొని దవాఖానకు తీసుకువచ్చి వైద్యం చేయిస్తున్నారు. చిన్న పాటి ఇరుకైన రూమ్‌లో మందులు పెట్టడానికి స్థలం సరిపోక కూర్చోవడానికి స్థలం లేక డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.





మిరుదొడ్డిలో నిలిచిపోయిన పనులు, మిరుదొడ్డి మార్కెట్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న పశువుల దవాఖాన

**దవాఖాన పనులు త్వరగా పూర్తిచేయాలి**

మిరుదొడ్డి టౌన్‌లో దవాఖాన పనులు పిల్లర్లపై స్లాప్ వరకు పూర్తయ్యాయి. మధ్యంతరంగా నిలిచిపోయిన దవాఖాన నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో పూర్తి చేస్తే ఆయా గ్రామాలకు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే సకాలంలో పశువులకు నాణ్యమైన వైద్యం అందుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, పశు వైద్యశాఖ అధికారులు స్పందించి మిరుదొడ్డిలో మధ్యంతరంగా నిలిచిపోయిన పశువుల దవాఖాన పనులను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజల కోరుతున్నారు.

## నేడు ప్రథమ వార్షికోత్సవం

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 26: పట్టణంలోని ధర్మవీర్‌యోగా శిక్షణ శిబిరం ప్రథమ వార్షికోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు యోగా శిక్షకురాలు, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత ప్రకటనలో తెలిపారు. ఏడాదిగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో యోగా ద్వారా ఆరోగ్యాన్ని పెంపాదించుకున్న మహిళలు తమ అనుభవాలను ఈ కార్యక్రమంలో వివరిస్తారని తెలిపారు. స్థానిక శివాజీనగర్‌లోని రైతు బజార్ కేంద్రంలో మధ్యాహ్నం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## జాతీయ సైన్స్ సంబురాలకు యశ్వంత్ ఎంపిక

మర్కూక్, ఫిబ్రవరి26: హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 28న జరిగే జాతీయ సైన్స్ దినోత్సవ సంబురాలకు దామరకుంట ఉన్నత పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థి యశ్వంత్ ఎంపికయ్యారని ఆ పాఠశాల ఉపాధ్యాయుడు బ్రహ్మయ్య తెలిపారు. ప్లాస్టిక్ బాటిల్ నుంచి అతి తక్కువ ఖర్చుతో వ్యవసాయ క్షేత్రాలకు ఫెన్సింగ్ అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ సైన్స్ సంబురాలకు మండలం నుంచి యంశ్వంత్ ఎంపికకావడంపై ఎంఈవో వెంకట్‌రాములు,జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, పాఠశాల బృందానికి అభినందనలు తెలిపారు.

## కంప్యూటర్ విరాళం



కంప్యూటర్ అందజేస్తున్న ఆకుల నరేశ్

చేర్యాల, ఫిబ్రవరి 26 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి హనుమకొండకు చెందిన ఆకుల నరేశ్ అనే దాత కంప్యూటర్ సెట్‌తో పాటు ప్రింటర్‌ను బుధవారం విరాళంగా అందజేశారు.కార్యక్రమంలో ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

## 108 అంబులెన్స్ తనిఖీ

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 26 : కొండపాక 108 అంబులెన్స్‌ను బుధవారం జిల్లా కో ఆర్డినేటర్ హరిరామకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరుతో పాటు రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రమాదం సమయంలో ప్రాథమిక చికిత్స గురించి అంబులెన్స్‌లో ఉండే పరికరాలు ఏఏ సమయంలో బాధితులకు ఉపయోగిస్తారని టెక్నీషియన్ మహేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ప్రథమ చికిత్స అందించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దన్నారు. జిల్లాలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న కొండపాక 108 సిబ్బందిని అభినందించారు.

## ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో దళితులకు అన్యాయం

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి26: ధూళిమిట్ట మండలంలోని కూటిగల్‌లో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో దళితులకు అన్యాయం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు నల్ల రాజేశ్ బుధవారం ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూటిగల్ గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి 150 ఇండ్లు మంజూరు చేసిందన్నారు. ఇండ్ల మంజూరులో దళితులకు తీవ్ర అన్యా యం జరిగిందన్నారు. అర్హులైన దళితులకు ఇండ్లు మంజూరు కాలేదన్నారు. అధికారులు స్పందించి నిరుపేదలైన దళితులకు ఇండ్లు మంజూరు చేయాలని లేనిపక్షంలో పోరాటాలు చేయనున్నట్లు హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు దాసరం బాలకృష్ణ, గ్రామశాఖ అధ్యక్షుడు బూరుగు సుధాకర్, దాసారం బాబు, కార్యదర్శి దాసారం పెద్దబాబు ఉన్నారు.

## వీడిన మహిళ అదృశ్యం మిస్టరీ

వర్గల్,ఫిబ్రవరి26: మండలంలోని అనంతగిరిపల్లికి చెందిన మహిళ అదృశ్యం కేసు మిస్టరీ వీడింది. గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ధార యాదమ్మ(40)ఈనెల 15వ తేదీన ఇంటి నుంచి వెళ్లి రాత్రి తిరిగిరాలేదు. మరుసటి రోజు కుటుంబ సభ్యులు గౌరారం సీఎస్‌లో యాదమ్మ మిస్సింగ్‌పై కేసు పెట్టారు. మంగళవారం సాయంత్రం గజ్వేల్, వర్గల్ మండలాల సరిహద్దు అటవీప్రాంతంలో మహిళ మృతదేహం లభ్యమైంది. మిస్సింగ్ అయిన యాదమ్మ కావొచ్చు అనే అనుమానంతో మంగవారం రాత్రి అనంతగిరిపల్లిలో విచారణ చేపట్టారు. మృతురాలి కొడుకు గ్రామానికి చెందిన బండ్ల చిన్నలక్ష్మయ్య(39)పై అనుమానం వ్యక్తం చేయగా, వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారు. యాదమ్మతో సంవత్సరంన్నర నుంచి వివాహేతర సంబంధం ఉందని, ఆరునెలల నుంచి బలవంతంగా తనను పెళ్లిచేసుకోవాలని ఒత్తిడి చేసిందన్నారు. ముందుగా నిర్ణయించుకున్న పథకం ప్రకారం ఈనెల 15న ఉదయం యాదమ్మను తన మోటర్ సైకిల్‌పై ఎక్కించుకొని కోమటిబండ అడవిలోకి తీసుకుపోయి చీరతో మెడను గట్టిగా చుట్టి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. మృతురాలి కొడుకు ధార సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మయ్యపై కేసున మోదు చేయడం జరిగిందని, యాదమ్మ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.